విలేకరులు కావలెను

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 119 | శుక్రవారం 28. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## భారత్ ధర్మశాల కాదు!



- దేశంలో నివసించే హక్కు పౌరులకే: అమిత్ షా
- అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపాలని భద్రతా సంస్థలకు దిశానిర్దేశం
- అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తి చేయడమే లక్ష్యమని వెల్లడి

.. వివరాలు 4లో

## 22ఏ తీసేయకుంటే సచివాలయం ముట్టడి



- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి
- ప్రజల ఆస్తులపై 22ఏ తాళం.. ప్రభుత్వ భూములు అమ్మకానికి
- భూవివాదాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బ
- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బ్రోకర్లకు ఒక్క రూపాయి ఇవ్వొద్దు..
- బాధితులకు అండగా ఉంటాం
- రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజం

## మోహన్ భగవత్ సభపై మమ్దానీ అభ్యంతరం

- న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ కార్యక్రమంపై రాజకీయ దుమారం
- మేయర్ తీరుపై మండిపడ్డ అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్

4





# అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలి

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

- మీరాలం ట్యాంక్‌ను ప్రముఖ పర్యాటక పనుల పరిశీలన
- పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన
- నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలి
- చెరువులోకి మురుగు నీరు చేరకుండా అన్ని చర్యలు తీసుకోవాలి
- చెరువు నుంచి మూసీలోకి వరద నీరు వెళ్లేలా నాలాను విస్తరించాలి
- పర్యాటకులు చెరువులో వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ చేయాలి
- చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి
- అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్నందున మీరాలం చెరువును, పరిసర ప్రాంతాలను పర్యాటకులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు జరగాలి
- పాల్గొన్న మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు,







# విద్యా సేవకు వ్యాపార గ్రహణం!

- పుట్టగొడుగుల్లా ప్రైవేట్ బడులు...
- ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలూ ప్రైవేట్ బాటలోనే...
- విద్యాశాఖ పర్యవేక్షణపై ఎన్నో ప్రశ్నలు
- నిబంధనలు.. పర్యవేక్షణ ఎక్కడ?


ఉమ్మడి నిజామాబాద్ ఆగస్టు 27 టి.ఎన్ రమేష్
(తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్)


నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల లో ప్రతి ఏటా మే నెల వచ్చేసరికి పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు వెలుస్తున్నాయి. 20 ఏళ్ల క్రితం, కొందరు విద్యాధికులు నిరుద్యోగాన్ని అధిగమించేందుకు, నలుగురి నుండి పదిమంది వరకు కలిసి, ఒక పాఠశాల నెలకొల్పి సేవా తత్పర భావంతో, పాఠశాలను నిర్వహించేవారు. ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న తల్లిదండ్రులు సదరు పాఠశాల నిర్వాహకులకు, కొంత మొత్తంలో డబ్బు చెల్లించేవారు. దీంతో పాఠశాల నిర్వాహకులకు, స్వయం ఉపాధి లభించేది. అది ఒకప్పటి మాట. నేటి రోజుల్లో, రైస్ మిల్ యజమానులు, క్యాపిటలిస్టులు ప్రైవేట్ విద్యను వ్యాపారంల మార్చేశారని, ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరు నిర్వహించే పాఠశాలలు ఒక ఏడాది ఒకచోట, ఆపై మరోచోట పాఠశాలలు నిర్వహించడం హాస్యస్పదం. ఒక అనుమతితో (అసలు అనుమతులు ఉన్నాయో లేదో) బ్రాంచులుగా ఒకే పట్టణంలో, ఒకే జిల్లాలో పలుచోట్ల విద్య వ్యాపార నిర్వహణ కొనసాగిస్తున్నావారు ఉన్నారు. విద్య బోధనకు కనీస అర్హత లేని సిబ్బందిని నియమించుకొని, తక్కువ జీతానికే విద్య బోధనలు కొనసాగిస్తున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. విద్య చట్టానికి తూట్లు పొడుస్తూ పాఠశాలలోని పుస్తకాలు, నోట్ బుక్స్, ఏక వస్త్ర దుస్తులు అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నారని అపవాదు సైతం ఉన్నది. ఇక మే నెల వచ్చిందంటే, స్థానికంగా ఉండే కొందరు, ఎంఈఓ లకు జిల్లాస్థాయి డి ఈ ఓ లకు కాసుల పంటలు కురుస్తున్నాయని ఉభయ జిల్లాల ప్రజలు ముక్తకంఠంతో విమర్శిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి పట్టణలలో, విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రజాలను దోపిడీ చేస్తున్న, అటు రాజకీయ నాయకులు గాని, ఇటు పాలన అధికారులు గాని పట్టించుకోకపోవడం ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నది. డిచ్పల్లి మండల కేంద్రంలోని ఒక కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యజమాన్యం హాస్టల్ నిర్వహిస్తూ పరిమితికి మించి విద్యార్థులని హాస్టల్లో చేర్చుకొని కోళ్లను కమ్మిన విధంగా విద్యార్థులను గదులలో కుక్కుతున్నారని

అపఖ్యాతి సైతం ఉన్నది. విద్యాశాఖలోని అధికారులు కొందరు లాలూచీ పడడంతో, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను, దోపిడికి గురి చేస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగులు సైతం వారి పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థల్లో, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తుండడంతో, వెలగబెట్టేది ప్రభుత్వ ఉద్యోగం, వారి పిల్లలను చేర్చేది ప్రైవేట్ లోన అని ముక్కున వేలేసుకుంటున్నారు ఉభయ జిల్లాల ప్రజలు. అధికార వ్యవస్థ మారనంతవరకు ఈ తిప్పలు తప్పవని అంటున్నారు కొందరు సామాజికవేత్తలు.

**కొసమెరుపు:**

కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలను బినామీలతో నిర్వహించడం కోసం మెరుపు.

## ఇప్పుడే ఎన్నికలు జరిగితే ఎన్డీయేదే మళ్లీ అధికారం..

- 'ఇండియా టుడే - సీఓటర్' నిర్వహించిన తాజా 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో వెల్లడి
- ఎన్డీఏ కూటమి 326 సీట్లు గెలుచుకునే అవకాశం
- జనవరి సర్వేలో 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా,
- ప్రస్తుతం 26 సీట్లు తగ్గి 326 సీట్లకు పడిపోయింది.
- అయితే ఎన్డీయే కూటమి బలం తగ్గుదల వెనుక నీట్ ఎగ్జామ్, రామ మందిర విరాళాల చోరీ, ఈ20 పెట్రోల్ వంటి అంశాలు





## ప్రజా సమస్యలు పరిష్కరించాలేక ప్రతిపక్ష నాయకుల అరెస్టు

- హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత..
- నగరంలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి
- ధర్నా శిబిరం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది.
- హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం
- పోలీసులు, బీఆర్ఆర్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది

## కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం

హైదరాబాద్ తెలంగాణ వాణి)



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం అందింది. హర్యానాలో ప్రముఖ ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి విచ్చేసి.. అక్కడి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడటంతో పాటు.. వారిని ఉద్దేశించి డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్ ఇవ్వాల్సిందిగా సదరు యూనివర్సిటీ కేటీఆర్ ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్ కు లేఖ రాశారు. ఆయన రాకతోపాటు.. ఆలోచనలు విద్యార్థులకు ఇచ్చే ప్రసంగం ఎంతో స్ఫూర్తినిస్తాయని, వారిలో ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్ కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టీ సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. భారత రాజ్యాంగానికి ఆమోదం లభించి.. 75 ఏళు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రాజ్యాంగ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో ఎదురైన పోరాటాలు, సవాళ్లు, రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

## 'ఆడబిడ్డ మనసు గాయపడింది'

### టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ తెలంగాణ వాణి)



రక్షా బంధన్ (రాఖీ పండుగ) వేళ తెలంగాణ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. తన సోదరుడు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీరుపై టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగ రోజున కేటీఆర్ అందుబాటులో లేకపోవడంపై ఆమె తీవ్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పండుగ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత, సోదరుడి వ్యవహార శైలిపై మనస్తాపం చెందారు. "గత ఏడాది రాఖీ పండుగ సమయంలో ఆయన నగరంలో లేకుండా వెళ్లిపోయారు. కానీ ఈసారి ఏకంగా దేశంలోనే లేకుండా పారిపోయారు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పండుగ రోజున అన్నకు రాఖీ కట్టలేకపోవడంపై తన ఆవేదనను వెళ్లగక్కారు. కుటుంబంలోనూ, రాజకీయాల్లోనూ జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ.. "ఒక ఆడబిడ్డగా నాక్కూడా ఆత్మగౌరవం ఉంటుంది. ఆయన ప్రవర్తించిన తీరుతో నేను కూడా చాలా హర్ట్ అయ్యాను" అని పేర్కొన్నారు.

# పొలాన్ని చదివిన కమ్యూనిస్టు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి

రైతు గురించి మాట్లాడేవారు.. రైతు సమస్యలపై పోరాడేవారు అనేకమంది ఉంటారు. కానీ, రైతు జీవితాన్ని అధ్యయనం చేసి, ఆ జీవితాన్ని నిర్దేశించే సామాజిక ఆర్థిక సంబంధాలను అర్థం చేసుకుని, ఆ అవగాహనను నిరంతర ప్రజా ఉద్యమంగా మలిచిన నాయకులు చాలా అరుదు. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అలాంటి కమ్యూనిస్టు నాయకుడు. ఆయన జీవితాన్ని ఒక వ్యక్తి జీవితచరిత్రగా చూస్తే సరిపోదు. తెలంగాణ గ్రామీణ సమాజంలో కమ్యూనిస్టు ఉద్యమం ఎదిగిన తీరు, రైతాంగ పోరాటం పరిణామం, వ్యవసాయ రంగంపై మారుతున్న ప్రభుత్వ విధానాలు, వాటిపై ఒక మార్క్సిస్టు నాయకుడు సాగించిన అధ్యయనం - పోరాటం ఈ సమస్తాన్ని కలిపి చూస్తేనే ఆయన జీవితానికి సరైన అర్థం లభిస్తుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలోని తిమ్మంపేట గ్రామంలో పుట్టి పెరిగిన మల్లారెడ్డి బాల్యంలోనే గ్రామీణ సమాజంలోని అసమానతలను చూశారు. భూస్వాములు, కరణాలు, మాలి పటేళ్ల ఆధిపత్యం, పేదలపై పెత్తనం, గ్రామీణ జీవితంలో వర్గ విభజన లాంటివన్నీ ఆయన రాజకీయ చైతన్యానికి నేపథ్యంగా నిలిచాయి. 1961లో గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడటం, 1962 ఎన్నికల్లో పేద ప్రజలు కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించడం ఆయనపై ప్రభావం చూపాయి. 1964లో కమ్యూనిస్టు పార్టీ విభజన తర్వాత ఏర్పడిన సీపీఐ(ఎం)లో ఆయన చేరారు. అప్పటి నుంచి ఆయన జీవితం పార్టీతో, ప్రజలతో, ముఖ్యంగా రైతాంగ ఉద్యమంతో ముడిపడిపోయింది. ఆయనకు పాఠశాల విద్య ఎక్కువగా దక్కలేదు. పదో తరగతి తర్వాత చదువు కొనసాగలేదు. అయితే అక్కడితో వారి అధ్యయనం ఆగలేదు. పుస్తకాలు ఆయనకు విశ్వవిద్యాలయాలయ్యాయి. గ్రామం పాఠశాల అయింది. రైతు జీవితం పాఠ్యాంశమైంది. ఉద్యమం రాజకీయ విద్యను అందించింది. మార్క్సిజాన్ని ఆయన కేవలం సిద్ధాంతంగా చదవలేదు. భూమి, కౌలు, అప్పు, ధర, మార్కెట్, శ్రమ వంటి వాస్తవ జీవిత సమస్యలతో అనుసంధానించి అర్థం చేసుకున్నారు. అందుకే ఆయన ప్రసంగాల్లో నినాదం కంటే వాస్తవాలు ఎక్కువగా కనిపిస్తాయి. రచనల్లో భావోద్వేగం కంటే అధ్యయనం బలంగా ఉంటుంది.

ఆ అధ్యయనం వ్యవసాయ రంగానికే పరిమితం కాలేదు. సాహిత్యంపై కూడా ఆయనకు మంచి పట్టు సాధించారు. దీన్ని నేను స్వయంగా అనుభవించాను. 2011లో నేను రాసిన 'వికసించని మందారాలు' కవితా సంపుటిని ఆయనకు అందించినప్పుడు, పుస్తకాన్ని కేవలం ఒకసారి తిప్పి చూసినట్టు కాదు, కవితల అంతరార్థాన్ని, సామాజిక నేపథ్యాన్ని, వాటిలోని భావప్రవాహాన్ని పరిశీలించారు. దాదాపు పది నిమిషాల్లోనే పుస్తకంపై తన అవగాహనను ఏర్పరచుకున్నారు. మరో పది నిమిషాల్లో ఆ పుస్తకానికి ముందుమాట రాశారు. ఆ వేగం కేవలం రచనా చాతుర్యానికి సూచిక కాదు. చదివినదాన్ని వెంటనే గ్రహించి, దాని సారాన్ని పట్టుకుని, అవసరమైన మాటలో వ్యక్తీకరించగల అధ్యయనశీలతకు అది నిదర్శనం. 'వికసించని మందారాలు'కు ఆయన రాసిన ముందుమాట నాకు వ్యక్తిగతంగా ఒక జ్ఞాపకం మాత్రమే కాదు. మల్లారెడ్డి సాహిత్య దృష్టికి కూడా ఒక చిన్న సాక్ష్యం. రైతాంగం, వ్యవసాయం, రాజకీయాలు, చరిత్ర వంటి విస్తృత రంగాల్లో ఆయనకు ఉన్న పరిజ్ఞానంతో పాటు సాహిత్యాన్ని కూడా సామాజిక జీవితంతో అనుసంధానించి చూడగలిగిన దృష్టి ఆయనలో ఉంది. కవిత్వాన్ని కేవలం పదాల అలంకారంగా కాకుండా సమాజం పట్ల రచయితకు ఉన్న స్పందనగా చూడగలిగారు. ఒక యువ లేదా సమకాలీన రచయిత రచనలోని సామాజిక అంతస్సారాన్ని గుర్తించి, దానిని ప్రోత్సహించడానికి ముందుమాట రాయడం ఆయనలోని సాహిత్య సంస్కారానికి నిదర్శనం.

ఇక్కడే మల్లారెడ్డి వ్యక్తిత్వంలోని మరో కోణం కనిపిస్తుంది. సాధారణంగా రాజకీయ నాయకుడి అధ్యయనం రాజకీయ పుస్తకాల వరకే పరిమితమవుతుంది. కానీ ఆయన పఠన పరిధి విస్తృతమైనది. వ్యవసాయ విధానాలపై నివేదికలు చదివిన వ్యక్తే సాహిత్యాన్ని కూడా అంతే శ్రద్ధగా చదవగలిగారు. చరిత్రను పరిశీలించిన వ్యక్తే కవిత్వంలోని మానవీయ స్పందనను గుర్తించగలిగారు. ఈ విస్తృత పఠనమే ఆయన మాటలకు లోతును ఇచ్చింది. తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమం తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్న కాలంలో మల్లారెడ్డి రాజకీయ జీవితం మరింత పదునెక్కింది. 1970 - 80 దశకాల్లో వరంగల్ ప్రాంతంలో సీపీఐ(ఎం) కార్యకర్తలపై దాడులు, హత్యలు, కేసులు, అరెస్టులు కొనసాగాయి. ఆయన స్వయంగా అజ్ఞాత జీవితాన్ని అనుభవించారు. ప్రజల కోసం పనిచేసే కార్యకర్తకు



నిర్బంధం కొత్త విషయం కాదు. నిర్బంధం మధ్య కూడా రాజకీయ నిబద్ధతను నిలబెట్టుకోవడం ఉద్యమకారుడి అసలు పరీక్ష. ఆ పరీక్షను ఆయన దాటారు. అధికారం కోసం రాజకీయాన్ని ఎంచుకోలేదు. ప్రజల మధ్య ఉండటానికే రాజకీయాన్ని ఎంచుకున్నారు.

మల్లారెడ్డి జీవితానికి రైతాంగ ఉద్యమం కేంద్రబిందువు. తెలంగాణలో రైతు సంఘం నిర్మాణం నుంచి అఖిల భారత కిసాన్ సభ నాయకత్వం వరకు ఆయన ప్రయాణం సాగింది. రైతు సమస్యలను రాష్ట్ర సరిహద్దుల్లో బంధించకుండా జాతీయ వ్యవసాయ విధానాల ప్రశ్నగా ముందుకు తీసుకెళ్లారు. అఖిల భారత కిసాన్ సభలో జాతీయ స్థాయి బాధ్యతలు నిర్వహించారు. ఇది ఒక పదవి కాదు. దేశంలోని వివిధ ప్రాంతాల రైతాంగ సమస్యలను సమగ్రంగా చూడాల్సిన బాధ్యత. పంజాబ్ రైతు, తెలంగాణ రైతు, బీహార్ కౌలు రైతు, కేరళ చిన్న రైతు వారి పరిస్థితుల్లో తేడాలున్నా భూమి, మార్కెట్, రుణం, ధర, ఉత్పత్తి వ్యయం, ప్రభుత్వ విధానాల ప్రశ్నల్లో ఉన్న సంబంధాలను ఆయన గుర్తించారు. రైతు అంటే ఒకే వర్గం కాదని ఆయన రాజకీయ అవగాహన స్పష్టం చేసింది. భూస్వామి, ధనిక రైతు, మధ్యతరగతి రైతు, సన్నకారు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుడు, వారి ప్రయోజనాలు ఒకేలా ఉండవు. రైతాంగ సమస్యను అర్థం చేసుకోవాలంటే గ్రామీణ వర్గ సంబంధాలను అర్థం చేసుకోవాలి. భూమి ఎవరి చేతిలో ఉంది? సాగు చేసేది ఎవరు? పంటకు పెట్టుబడి ఎవరిది? కౌలు ఎంత? అప్పు ఎక్కడి నుంచి వస్తోంది? పంటను ఎవరు కొనుగోలు చేస్తున్నారు? ధరను ఎవరు నిర్ణయిస్తున్నారు? ఈ ప్రశ్నలే రైతు సంక్షోభం వెనుక ఉన్న వాస్తవాన్ని బయటపెడతాయి. అందుకే ఆయనకు రైతు సమస్య అంటే కేవలం పంట ధర సమస్య కాదు. అది భూమి సమస్య. కౌలు హక్కుల సమస్య. రుణ సమస్య. నీటి సమస్య. మార్కెట్ సమస్య. ప్రభుత్వ కొనుగోలు సమస్య. వ్యవసాయ కార్మికుడి ఉపాధి సమస్య. వ్యవసాయ ఉత్పత్తిపై కార్పొరేట్ ఆధిపత్యాన్ని అడ్డుకునే ప్రశ్న. రైతు జీవితాన్ని ప్రభావితం చేసే ఈ అంశాలన్నింటినీ కలిపి చూడటం ఆయన రాజకీయ దృష్టిలోని ప్రధాన బలం.

కనీస మద్దతు ధర కోసం ఆయన చేసిన పోరాటం కూడా ఇదే దృక్పథంలో భాగం. రైతు పంటను ఉత్పత్తి చేస్తాడు. కానీ ఆ పంటకు ధరను రైతు నిర్ణయించడు. విత్తనాల ధరను కంపెనీలు నిర్ణయిస్తాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరుగుతాయి. బ్యాంకు రుణం రైతు మీద వడ్డీ భారాన్ని పెడుతుంది. మార్కెట్‌లో పంట ధర పడిపోతుంది. చివరికి ఉత్పత్తి చేసిన రైతే నష్టపోతాడు. ఈ విరోధాన్ని పరిష్కరించకుండా రైతు సంక్షోభానికి శాశ్వత పరిష్కారం సాధ్యం కాదని ఆయన నిరంతరం వాదించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం అదనంగా రైతుకు ధర లభించాలన్న డిమాండ్‌ను ఆయన బలంగా ముందుకు తెచ్చారు. ఇది కేవలం ధర పెంచమనే డిమాండ్ కాదు. రైతు ఉత్పత్తికి సముచిత విలువ ఇవ్వాలనే ప్రశ్న. ప్రభుత్వం రైతును మార్కెట్ దయకు వదిలేయకుండా బాధ్యత తీసుకోవాలనే ప్రశ్న. కౌలు రైతుల సమస్యపై కూడా ఆయన స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. భూమి స్వంతం లేని వ్యక్తి సాగు చేస్తే అతను రైతు కాదా? భూమి పట్టా పేరులో ఉన్నవారికే ప్రభుత్వ సహాయం అందితే వాస్తవంగా సాగు చేస్తున్న కౌలు రైతు పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం లేకుండా రైతు సంక్షేమం గురించి మాట్లాడటం అసంపూర్ణం. కౌలు రైతుకు గుర్తింపు, రుణం, బీమా, పంట నష్టం పరిహారం, సాగు హక్కులు కల్పించాలన్న డిమాండ్ రైతాంగ ఉద్యమంలో ఆయన నిరంతరం ముందుకు తెచ్చిన అంశం. 2020 - 21లో దేశాన్ని కుదిపేసిన మూడు వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతాంగ ఉద్యమంలో కూడా ఆయన తెలంగాణ నుంచి బలమైన స్వరం వినిపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ ఆధిపత్యానికి తెరిచే విధానాలను ఆయన వ్యతిరేకించారు. రైతు ఉత్పత్తి, మార్కెట్, ధరలపై ప్రభుత్వ బాధ్యత తగ్గి, కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగితే చిన్న, సన్నకారు రైతు మరింత అసురక్షితుడవుతాడని హెచ్చరించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు నెలల తరబడి పోరాడినప్పుడు తెలంగాణలో కూడా ఆ ఉద్యమానికి మద్దతుగా రైతులను సమీకరించడంలో ఆయన భాగస్వామ్యం అయ్యారు.

వ్యవసాయంలో కార్పొరేట్ జోక్యాన్ని ఆయన కేవలం కొనుగోలు, అమ్మకాలకే పరిమితం చేసి చూడలేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, మార్కెటింగ్, రుణం - వ్యవసాయ ఉత్పత్తి గొలుసులోని ప్రతి దశలో పెరుగుతున్న ప్రైవేటు ఆధిపత్యాన్ని ఆయన పరిశీలించారు. అధిక ఎరువుల వినియోగం వెనుక ఉన్న వాణిజ్య ప్రయోజనాలను ప్రశ్నించారు. రైతు శాస్త్రీయ వ్యవసాయం చేయాలి అంటే శాస్త్రీయ సలహా కూడా కంపెనీల మార్కెటింగ్ ప్రయోజనాలకు అతీతంగా ఉండాలని ఆయన పట్టుదలగా చెప్పారు. మల్లారెడ్డి మరో విశిష్టత ఆయన రచనా కృషి. ఆయనకు రచన ప్రచారం కోసం కాదు. ఉద్యమానికి జ్ఞానాన్ని సమకూర్చేందుకు. భారతదేశ రైతు ఉద్యమాల చరిత్ర నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వరకు ఆయన అధ్యయనం చేశారు. రైతు ఉద్యమాల చరిత్రను నమోదు చేయడం ద్వారా నేటి పోరాటాలను గత పోరాటాల అనుభవాలతో అనుసంధానించారు. చరిత్ర ఆయనకు గతాన్ని స్మరించుకోవడానికి కాదు; వర్తమాన పోరాటానికి దిశను కనుగొనడానికి అవసరమైన సాధనం.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై ఆయన చేసిన రచనలు ఈ దృష్టిని ప్రతిబింబిస్తాయి. రైతాంగ పోరాటాన్ని కేవలం వీరగాథగా కాకుండా, భూమి, వెట్టి, భూస్వామ్య ఆధిపత్యం, ప్రజా ప్రతిఘటన, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం వంటి సామాజిక, ఆర్థిక అంశాలతో చూడాల్సిన అవసరాన్ని ఆయన రచనలు గుర్తుచేస్తాయి. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలకు సమాధానం కూడా చరిత్రను శాస్త్రీయంగా అధ్యయనం చేయడమేనన్న అవగాహన ఆయనలో బలంగా ఉంది. మల్లారెడ్డి జీవితంలో అధ్యయనం ఒక అలవాటు కాదు. అది రాజకీయ క్రమశిక్షణ. బడ్జెట్ చదవాలి. వ్యవసాయ విధానాలు చదవాలి. చట్టాలు చదవాలి. ప్రభుత్వ గణాంకాలు చూడాలి. రైతుతో మాట్లాడాలి. గ్రామానికి వెళ్లాలి. పంటను చూడాలి. అప్పు నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాతే రైతు సమస్యపై మాట్లాడాలి. ఈ పద్ధతి ఆయనను కేవలం వేదికలపై ప్రసంగించే నాయకుడి స్థాయి నుంచి అధ్యయనశీలి అయిన ప్రజా నాయకుడి స్థాయికి తీసుకెళ్లింది. ఆయన జీవితంలోని మరో విశేషం వయసు. దశాబ్దాల ఉద్యమం తర్వాత కూడా ప్రజా జీవితానికి దూరం కాలేదు. కరోనా కాలంలో కూడా రైతుల సమస్యలపై ప్రభుత్వాలకు లేఖలు రాశారు. ఎనభై దాటిన వయసులోనూ వ్యవసాయ రంగంపై పుస్తకాలు రాశారు, రైతు సమస్యలపై మాట్లాడారు, ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వయసు పెరిగేకొద్దీ శరీరం నెమ్మదించవచ్చు; కానీ ప్రజల పట్ల బాధ్యత తగ్గకూడదనే జీవన సందేశాన్ని ఆయన ఆచరణలో చూపించారు.

ఇటీవలి కాలంలో కూడా రైతు సంఘం కార్యకర్తలకు స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాలని, భూ సమస్యలను పట్టించుకోవాలని, ప్రతి కార్యకర్త అధ్యయనం పెంచుకోవాలని ఆయన ఇచ్చిన పిలుపు ఆయన రాజకీయ జీవితానికి కొనసాగింపే. ఉద్యమం అంటే పెద్ద సభలు, పెద్ద నినాదాలు మాత్రమే కాదని, గ్రామంలో రైతు ఎదుర్కొంటున్న ఒక భూ సమస్యను పట్టుకోవడం నుంచి ఉద్యమం ప్రారంభమవుతుందని ఆయన అనుభవం చెబుతోంది. సారంపల్లి మల్లారెడ్డిని సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడిగా మాత్రమే గుర్తించడం సరికాదు, ఆయన తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక తరం అనుభవాన్ని మోసుకొచ్చిన నాయకుడు. రైతాంగ ఉద్యమంలో దీర్ఘకాలం పనిచేసిన నిర్వాహకుడు. అఖిల భారత కిసాన్ సభలో జాతీయ స్థాయి నాయకుడు. వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసిన ప్రజా మేధావి. రైతు ఉద్యమ చరిత్రను నమోదు చేసిన రచయిత. సాహిత్యాన్ని కూడా ఆస్వాదించి, కొత్త రచయితలను ప్రోత్సహించిన సహృదయుడు. అయితే ఆయన జీవితానికి అసలు కొలమానం పదవులు కాదు. ప్రజల మధ్య గడిపిన కాలం. నిర్బంధంలో నిలబెట్టుకున్న నిబద్ధత. రైతు సమస్యపై చూపిన పట్టుదల. చదివిన పుస్తకాలను ఉద్యమ జ్ఞానంగా మార్చిన తీరు. ఒక తరం నుంచి మరో తరానికి అందించిన రాజకీయ అనుభవం. సాహిత్యాన్ని కూడా ప్రజా జీవితంలోని అంతర్భాగంగా చూడగలిగిన విస్తృత దృష్టి.

నేడు భారత వ్యవసాయం కొత్త సంక్షోభాల మధ్య ఉంది. ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. పంట ధరల్లో అనిశ్చితి కొనసాగుతోంది. కౌలు రైతులకు గుర్తింపు కొరవడుతోంది. వాతావరణ మార్పులు పంటలపై ప్రభావం చూపుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై కార్పొరేట్ ఆధిపత్యం పెరుగుతోంది. వ్యవసాయ మార్కెట్‌లో రైతు బేరసారాల శక్తి బలహీనంగా ఉంది. ఇలాంటి సమయంలో మల్లారెడ్డి గారి జీవితాన్ని స్మరించుకోవడం అంటే ఒక సీనియర్ నాయకుడిని అభినందించడం మాత్రమే కాదు. ఆయన నేర్పిన పద్ధతిని తిరిగి గుర్తుచేసుకోవడం. ప్రజల మధ్య ఉండాలి. చదవాలి. ప్రశ్నించాలి. వాస్తవాలను సేకరించాలి. రైతాంగాన్ని ఒకే సమూహంగా కాకుండా దాని అంతర్గత వర్గ సంబంధాలతో చూడాలి. ప్రభుత్వ విధానాలను విమర్శించడమే కాదు, వాటి వెనుక ఉన్న ఆర్థిక ప్రయోజనాలను బయటపెట్టాలి. ఉద్యమాన్ని నినాదం నుంచి సంఘటిత శక్తిగా మార్చాలి. చరిత్రను అధ్యయనం చేసి వర్తమాన పోరాటానికి ఉపయోగించాలి. సాహిత్యాన్ని ప్రజల జీవిత స్పందనగా చదవాలి. కొత్త రచయితలలోని సామాజిక చైతన్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి. ఇదే సారంపల్లి మల్లారెడ్డి జీవిత సారం.

తిమ్మంపేటలో గ్రామీణ అసమానతలను చూసిన యువకుడు కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చాడు. నిర్బంధాన్ని ఎదుర్కొన్నాడు. అజ్ఞాత జీవితాన్ని అనుభవించాడు. రైతాంగాన్ని సంఘటితం చేశాడు. రాష్ట్రం నుంచి దేశస్థాయికి రైతు గొంతును తీసుకెళ్లాడు. పుస్తకాలు రాశాడు. చరిత్రను అధ్యయనం చేశాడు. సాహిత్యాన్ని చదివాడు. ఒక కవితా సంపుటిని కొద్దిసేపట్లో చదివి దాని అంతరార్థాన్ని పట్టుకుని ముందుమాట రాసినంత వేగంతో రచనను అర్థం చేసుకున్నాడు. వయసు మీదపడినా ఉద్యమాన్ని విడిచిపెట్టలేదు. అందుచేత సారంపల్లి మల్లారెడ్డి జీవితం ఒక వ్యక్తి జీవిత చరిత్ర కాదు. అది తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమం, రైతాంగ పోరాటం, అధ్యయనం, సాహిత్య సంస్కారం, ప్రజా నిబద్ధత కలిసిన ఒక దీర్ఘ ప్రయాణం. పొలాన్ని చదివిన కమ్యూనిస్టు ఆయన. రైతు బాధను రాజకీయ ప్రశ్నగా మలిచిన నాయకుడు ఆయన. చరిత్రను చదివి, చరిత్రను రాసి, చరిత్రలో భాగమైన ఉద్యమకారుడు ఆయన. సాహిత్యంలోని సామాజిక స్పందనను గుర్తించిన సహృదయ పాఠకుడు ఆయన. ప్రజల కోసం పోరాడాలంటే ముందుగా ప్రజల జీవితాన్ని చదవాలి. ఆ జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే అధ్యయనం చేయాలి. అధ్యయనాన్ని ఉద్యమంగా, ఉద్యమాన్ని సంఘటిత శక్తిగా మార్చాలి. ఇదే మల్లారెడ్డి నుంచి నేర్చుకోవాల్సిన పాఠం. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి దీర్ఘ ప్రజా - రైతాంగ ఉద్యమ జీవితానికి విప్లవ జోహార్లు.

**మామిండ్ల రమేష్ రాజా**
**రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)**
**లిబరేషన్ తెలంగాణ**
**సెల్:78932 30218**



## ప్రజా డాక్టర్ చల్మారెడ్డి మరణం వనపర్తికి తీరని లోటు

**వనపర్తి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ప్రజా సేవకు అంకితమైన డాక్టర్ చల్మారెడ్డి మరణం వనపర్తి ప్రాంత ప్రజలకు తీరని లోటని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ అన్నారు. డబ్బు కోసం కాకుండా సేవాభావంతో పేదలకు వైద్యం అందించిన గొప్ప వ్యక్తి చల్మారెడ్డి అని కొనియాడారు. వనపర్తితో పాటు పరిసర మండలాలు, గ్రామాల ప్రజలకు ఆయన అందించిన వైద్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని మహేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ్ నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## జాగృతి కళాశాలలో ఘనంగా విద్యార్థుల స్వాగత కార్యక్రమం



**వనపర్తి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి కృష్ణ ఫంక్షన్‌హాల్‌లో జాగృతి కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఘనంగా స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ ఫీజులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కళాశాల యాజమాన్యం సూచించింది. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. అనంతరం తెలంగాణ బోనాలు, బతుకమ్మ, కోలాటాల నృత్యాలతో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్, యజమాన్య సభ్యులు శ్యాంకుమార్, భాస్కర్, సత్యనారాయణలు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## వార్డెన్లపై చర్యల్లో రెండు రకాల నిబంధనలు ఎందుకు?

**వనపర్తి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

వార్డెన్లపై చర్యలు తీసుకునే విషయంలో అధికారులు ఒకే విధమైన నిబంధనలు పాటించాలని బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ శివ నాయక్ డిమాండ్ చేశారు. కొత్తకోట ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఆహార విషప్రయోగం ఘటనలో వార్డెన్ విజయపై వెంటనే సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. అయితే వనపర్తి ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలుర హాస్టల్‌కు సంబంధించిన పీడీఎస్ బియ్యం వ్యవహారంలో పంచనామా నమోదై వారం రోజులు గడిచినా వార్డెన్ నరేందర్ రెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పంచనామా, స్టాక్ రిజిస్టర్లు, గోదాం, బియ్యం రవాణా వివరాలను సమగ్రంగా పరిశీలించి నిష్పక్షపాత విచారణ చేపట్టాలని కోరారు. విచారణలో బాధ్యత తేలిన



వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వార్డెన్లందరికీ ఒకే ప్రమాణాలు అమలు చేయాలని శివ నాయక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు మల్లేష్ నాయక్, మురళి నాయక్, ఆంగోత్ శివ నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు



## ఓటరు జాబితా పరిశీలనలో దైద రవీందర్

**నకిరేకల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 225వ బూత్ లెనిన్ వార్డులో గురువారం ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు విలువను గుర్తించి, అర్హులైన వారి పేర్లు జాబితాలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి నుంచే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఒంటెపాక నాగరాజు, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, ఒంటెపాక అంబేద్కర్, ఏర్పుల తాజేశ్వర్, పరమేశం, రాములు, గింజల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష కౌన్సిలర్ల నిరసన



**చౌటుప్పల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**

చౌటుప్పల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాన్ని అఖిలపక్ష వార్డు కౌన్సిలర్లు బహిష్కరించి, గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

కమిషనర్ మినిట్ బుక్, ఎంపీ రికార్డు, గత కౌన్సిల్ సమావేశాల తీర్మానాలు, ఇతర రికార్డులను కౌన్సిలర్లకు అందుబాటులో ఉంచడం లేదని వారు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయ మరమ్మతులకు ఖర్చు చేసినట్లు చెబుతున్న రూ.40 లక్షల నిధుల వివరాలు కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వ్యవహారాల్లో పారదర్శకత పాటిస్తూ కౌన్సిలర్లను భాగస్వామ్యం చేయాలని కోరారు.నిరసనలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్, కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, పోలేపల్లి లక్ష్మి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## గృహ సముదాయ నీటి ట్యాక్స్ వసూలు నిలిపివేయాలి

**చౌటుప్పల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**

ఇంటి నల్లాలకు సరఫరా చేసే నీటికి ప్రత్యేకంగా ట్యాక్స్ వసూలు చేయడం నిలిపివేయాలని మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వారు ఈ అంశాన్ని ప్రస్తావించారు. గత పదేళ్లుగా నీటికి ప్రత్యేక ట్యాక్స్ వసూలు చేయలేదని, ప్రస్తుతం వసూలు చేయడం వల్ల పట్టణ ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. గత విధానాన్నే కొనసాగిస్తూ ట్యాక్స్ వసూలు నిలిపివేయాలని కోరారు.

## రాఖీల తయారీలో విద్యార్థుల సృజనాత్మకత



**చిలుకూరు, ఆగస్టు 27 (తెలంగాణ వాణి)**

: చిలుకూరు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ సందర్భంగా గురువారం విద్యార్థులతో రాఖీల తయారీ కార్యక్రమం నిర్వహించారు.క్రాఫ్ట్ టీచర్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో రంగుల కాగితాలు, పట్టు దారాలు, పూసలు, చెమ్కీలు, కార్డ్ బోర్డుతో పర్యావరణహిత రాఖీలను విద్యార్థులు తయారు చేశారు. అనంతరం విద్యార్థినులు బాలురకు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## సమ్మిళిత అభివృద్ధికి దివ్యాంగుల భాగస్వామ్యం అవసరం: ఎంఈఓ అజ్మీరా జగన్




**టేకులపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
దివ్యాంగుల సమ్మిళిత అభివృద్ధికి సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) అజ్మీరా జగన్ అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టేకులపల్లి మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. "సమ్మిళిత అభివృద్ధికి దివ్యాంగుల భాగస్వామ్యం--ఆత్మవిశ్వాసంతో సమాన అవకాశాలు" అనే ఇతివృత్తంతో జరిగిన ఈ పోటీలను ఎంఈఓ పరిశీలించి విజేతలు, పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు ప్రోత్సాహం, అనుకూల వాతావరణం కల్పిస్తే అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. క్రీడా పోటీలు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏ.మోహన్‌రావు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకయ్య, ప్రత్యేక అవసరాలు గల పిల్లల విభాగం సమన్వయకర్త రవీందర్‌బాబు, ఉపాధ్యాయులు వాలమ్మ, నరేష్, నీరజ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ గ్రామసభలను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు




**టేకులపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ గ్రామసభలను మండల కాంగ్రెస్ అధ్యక్షులు లక్కినేని శ్యాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు, ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్ పరిశీలించారు. బోడు, ఆర్‌సీ పేట, కొప్పురాయి తదితర గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొని ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను సమీక్షించారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లు, మరణించినవారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు శ్యాంబాబు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## బంజరుపల్లి నూతన పంచాయతీ కార్యాలయం ప్రారంభం



**ములుగు, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
ములుగు మండలంలో నూతనంగా ఏర్పాటైన బంజరుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క గురువారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతన గ్రామపంచాయతీల ఏర్పాటుతో స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని, గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిశ్రమల అనుమతుల్లో జాప్యం ఉండొద్దు: కలెక్టర్ దివాకర టీఎస్

### రూ.2.58 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం



**ఖమ్మం, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులను నిర్ణీత గడువులోగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి టీజీ ఐపాస్ సమావేశంలో పరిశ్రమల దరఖాస్తులు, అనుమతులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలపై సమీక్షించారు. గత సమావేశం అనంతరం 28 కొత్త యూనిట్లు 64 రకాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా, 32 అనుమతులను నిర్ణీత గడువులో మంజూరు చేసినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే శాఖల మధ్య సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులను తిరస్కరించే సందర్భంలో స్పష్టమైన కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని ఆదేశించారు. డీఐపీసీ సమావేశంలో 22 యూనిట్లకు వివిధ పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద రూ.2,58,18,743 మంజూరుకు ఆమోదం లభించింది. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రీస్ ప్రవీణ్ కుమార్, ఎల్‌డీఎం రవి ప్రసాద్, ఆర్టీఓ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముజాహిద్, ఇండస్ట్రీస్ ఏడి నకుల్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు, పాల్గొన్నారు...

# ఆరోగ్య కేంద్రానికే అనారోగ్యం..!

- **సిబ్బంది కొరతతో కునారిల్లుతున్న బనిగండ్లపాడు పీహెచ్‌సీ**
- **మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి: సీపీఎం**

**ఎర్రుపాలెం, ఆగస్టు 30 (తెలంగాణ వాణి):**
బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలు, సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పీహెచ్‌సీని సందర్శించి సర్వే నిర్వహించారు. రోగులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని, వైద్యాధికారి ప్రశాంత్‌తో సిబ్బంది, వైద్య సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ 31 గ్రామపంచాయతీలు, 50 వేలకుపైగా జనాభా ఉన్న మండలానికి ఒకే పీహెచ్‌సీ ఉండటం ఆందోళనకరమన్నారు. ఐదుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా



ఇద్దరే పనిచేస్తున్నారని తెలిపారు. ఫార్మసిస్ట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, హెల్త్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. తొమ్మిది సబ్‌సెంటర్లకు తొమ్మిది మంది ఏఎన్‌ఎంలు అవసరం కాగా నలుగురే ఉన్నారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, ఇన్సులిన్ అందుబాటులో లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. రక్త పరీక్షలకు అవసరమైన పరికరాలు, ల్యాబ్ సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేవన్నారు. 30 పడకల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా ఆయుష్మాన్ భవన్‌లో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. పీహెచ్‌సీలకు గత మూడేళ్లుగా తాత్కాలిక నిర్వహణ ఖర్చుల కోసం నిధులు మంజూరు చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వెంటనే వైద్యులు, సిబ్బందిని నియమించి, అవసరమైన మందులు, పరికరాలు, నిధులు సమకూర్చాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో వృత్తి సంఘం జిల్లా నాయకులు గొర్రాజు రాములు, షేక్ లలా సాహెబ్, దూదిగం బసవయ్య, నాగులవంచ వెంకట రామయ్య, బేతి శ్రీనివాసరావు, షేక్ మదార్ సాహెబ్, చిరంజీవి తదితరులు, పాల్గొన్నారు.

# ఉద్యోగుల డిమాండ్ల సాధనకు మహాధర్నా

**డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం**

**నస్పూర్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ జిల్లా సమీకృత సముదాయ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 4,500 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు హాజరయ్యారు. జిల్లా సమీకృత సముదాయ కార్యాలయ ముఖద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో



కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగులకు రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రతి నెల రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ సమస్యను పరిష్కరించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ సంఘాలకు తగిన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సంఘాలతో సమన్వయం చేసుకుని తదుపరి కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు, టీజీవో, టీఎన్జీవో ప్రతినిధులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం భైంసా కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పాఠశాల పరిసరాలు, విద్యార్థుల హాజరు, సిబ్బంది, వసతులు, విద్య, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గణితం, భౌతికశాస్త్రం తదితర అంశాల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి పెన్నులు బహుమతిగా అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా




విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఎంఈవో సుభాష్, ఎంపీఓ ప్రదీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



## మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం: కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్ ఐడీఓసీలో డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 49 డ్రగ్స్ కేసులు నమోదు చేసి 103 మందిని గుర్తించగా, 30 మందిని మత్తు విముక్తి కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గంజాయి సాగు, అక్రమ మందుల విక్రయాలపై నిఘా పెంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది 95 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సబ్‌కలెక్టర్ మనోజ్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనలో గుర్తింపు సంఘం విఫలం

**మందమర్రి ఆగస్టు 27 (తెలంగాణ వాణి)**
కార్మికుల హక్కుల సాధనలో గుర్తింపు సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తు పైరవీలకే పరిమితం అయ్యిందని ఎచ్ ఎం ఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సిద్ధం శెట్టి సాజన్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్ క్లబ్ సమావేశం లో ఆయన మాట్లాడుతు గత కొన్ని నెలలుగా సింగరేణి లో మెడికల్ బోర్డు నిర్వహణ లేక అనేక మంది కార్మిక వారసులు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఎచ్ ఎం ఎస్ చీఫ్ కల్వ కుంట్ల కవిత మెడికల్ బోర్డు జాప్యం పై నిరహార దీక్ష చేపడుతామని హేచ్చరించడం తో ప్రభుత్వం దిగి వచ్చి మెడికల్ బోర్డు నిర్వహణకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇటీవల జరిపిన మెడికల్ బోర్డు లో కేవలం 20 శాతం కార్మికులను మాత్రమే అన్ఫిట్ చేసి అర్హులైన వారిని విస్మరించారని అన్నారు. దీనిపై గుర్తింపు సంఘం నోరుమెదపక పోవడం లో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.



తక్షణమే సింగరేణి లో మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఎచ్ ఎం ఎస్ ఆధ్వర్యం లో సింగరేణి వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హేచ్చరించారు. ఈ సమావేశం లో పార్వతి రాజిరెడ్డి, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, నీరటి కార్తిక్, లింగాల కిరణ్, శ్రావణ్, పురుషోత్తం పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ): రాములు

**మంచిర్యాల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్‌లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో ప్రజలకు చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులను సూచించారు. గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి డివిజన్‌లో విద్యుత్ ఉద్యోగుల యూనియన్ జెండా ఆవిష్కరణ




**ఎల్లారెడ్డి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
కామారెడ్డి సర్కిల్ ఎల్లారెడ్డి డివిజన్‌లో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గంగాధర్ అధ్యక్షతన కార్యదర్శి మోహన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ నర్సాగౌడ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షులు రాఘవచారి గారు కార్యదర్శి దేవదాస్ గారు వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి గారు నాయకులు, నగేష్ శ్రీనివాస్ మహబూబ్ నారాయణ సతీష్ అంజయ్య షాబుద్దీను చిరంజీవి లింగం యాదగిరి దేవయ్య బిక్షపతి అజీముద్దీను బాన్సువాడ ప్రశాంత్ కార్మికులు పాల్గొన్నారు

## తెలంగాణా ఉద్యోగ సంఘాల మహా ధర్నా



**నిర్మల్, ఆగస్టు 27(తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు గెజిటెడ్ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు అందరూ కలిసి జిల్లా కేంద్రం లోని మునిసిపల్ ఆఫీసు ముందర నేడు ఉదయం మహా ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న 6 డిఏ లు విడుదల చేయాలని కోరారు. 2వ పి ఆర్ సి అమలు చేయాలని ఉద్యోగులకు సంబంధించిన 10 వేల కోట్ల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సి పి ఎస్ విధానాన్ని రద్దు చేసి ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ మహా ధర్నా లో పాల్గొన్న జిల్లా టి ఎన్ జి ఓ అధ్యక్షుడు వెలమల ప్రభాకర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం సి లింగన్న, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు జజ్జి పోశెట్టి, రవీందర్ తదితరులు వెళ్లి అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.

## సీ.ఎం.పీ.ఎఫ్ సేవలు పారదర్శకంగా అందించడమే లక్ష్యం



**మందమర్రి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
సింగరేణి ఉద్యోగులకు సీం.ఎం.పీ.ఎఫ్, పెన్షన్ సేవలను ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా అందించడమే లక్ష్యమని సీం.ఎం.పీ.ఎఫ్ రీజినల్ కమిషనర్ (రీజన్–2) వై.భరత కుమార్ గోవర్ధన్ తెలిపారు. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో గురువారం ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో సీం.ఎం.పీ.ఎఫ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీం.ఎం.పీ.ఎఫ్, పెన్షన్ లావాదేవీలను సీ–కేర్స్ డిజిటల్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. పెన్షన్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు 'ప్రయాస్' విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. అనంతరం ఏరియా అధికారులు కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో ఏరియా డీజీఎం (పర్సనల్) అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, సీ.ఎం.పి.ఎఫ్ సిబ్బంది ఎస్ఎస్ఏ, అనిత, వర ప్రసాద్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
నిజామాబాద్ సుభాష్‌నగర్‌లోని నారాయణ స్కూల్‌లో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏజీఎం సూర్యవంశీ శివాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎస్ఐ షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎస్ఐ షరీఫ్, ఏజీఎం శివాజీకి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ ప్రేమ, సోదం భావం, మానవత్వానికి ప్రతీక అన్నారు. శివాజీ మాట్లాడుతూ.. పండుగలు విద్యార్థుల్లో మానవీయ విలువలు, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షరీఫ్, ప్రిన్సిపాల్ జి. చందన, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎస్సీ నిరుద్యోగులు కాంట్రాక్టర్లుగా ఎదగాలి కలెక్టర్ రాజర్షిషా




**ఆదిలాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
ఎస్సీ నిరుద్యోగులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కాంట్రాక్టర్లుగా ఎదిగి ఆర్థికంగా స్థిరపడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్టింగ్ రంగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్, టెండర్ ప్రక్రియ, అందుబాటులో ఉన్న పనుల వివరాలపై అవగాహన కల్పించారు. కాంట్రాక్టింగ్ రంగంలోకి ప్రవేశించేందుకు అవసరమైన సహకారాన్ని అధికారులు అందిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి సునీత, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మిల్కా, ఇంజనీరింగ్ శాఖలకు చెందిన అధికారులు పవన్ కుమార్, రాజసింహం, రాజేష్ నాయక్, చంద్రమోహన్, సాగర్, కిరణ్ డిక్కీ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ అక్షిత్ కుమార్, ఎస్సీ యువకులు, ఆసక్తిదారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నేతల పరిశీలన



**రామకృష్ణాపూర్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డులోని 1, 2, 3 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశ నోటీసుల ప్రక్రియను జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఓటర్లు, ఎన్నికల ప్రతినిధులు, స్థానికులతో మాట్లాడి ప్రక్రియ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు, ఎన్నికల సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించి తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భీమ మల్లేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఎన్నికల సిబ్బంది, పార్టీ ప్రతినిధులు, ఓటర్లు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో 31న కేంద్రీకృత వంటశాల ప్రారంభం

**49,104 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం**



**మంచిర్యాల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠశాల అల్పాహార పథకంలో భాగంగా మంచిర్యాల వైద్య గోదాము ప్రాంగణంలో నిర్మించిన కేంద్రీకృత సామూహిక వంటశాలను ఈ నెల 31న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించనున్నారు. ఈ వంటశాల ద్వారా మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,104 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం అందించనున్నారు. ఇడ్లీ, దోశ, పూరీ, ఉప్మా, చిరుధాన్యాల ఇడ్లీ తదితర అల్పాహారాలను వారంలో వివిధ రోజుల్లో అందించనున్నారు. 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన వంటశాలలో ఆధునిక వంట పరికరాలు, ఆహార నాణ్యత పరీక్షా కేంద్రం, శుద్ధి చేసిన నీటి కేంద్రం, కూరగాయల శుభ్రపరిచే, కోసే యంత్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన పోషకాహారం అందించడంతో వారి ఆరోగ్యం, హాజరు శాతం మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు

# డిమాండ్ల సాధన కోసం ఉద్యోగుల మహాధర్నా




**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈ–జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ మాట్లాడుతూ.. 2వ పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఆరు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను పటిష్టంగా అమలు చేసి నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, విద్యాశాఖ రేషనలైజేషన్ జీవో 25ను సవరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీఆర్సీ నివేదిక విడుదలయ్యే వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసన, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ఆల్‌ఫోర్స్‌లో సందడిగా రాఖీ వేడుకలు

**నిర్మల్ - భైంసా: ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆల్‌ఫోర్స్ పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయబద్ధంగా ఒకరికొకరు రాఖీలు కట్టుకొని, హారతులు ఇచ్చుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచుకుంటూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అన్నాచెల్లెళు ,అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపాయి.



# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అమలులో అవకతవకలపై నిరసన



**మందమర్రి ఆగస్టు 27 (తెలంగాణ వాణి)**
పట్టణం లో ఇటీవల పంపిణి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అమలులో పూర్తిగా అవకతవకలు జరిగాయని . టిఆర్ఎస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు సూరిబాబు, బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అనేక అవకతవకలు జరిగాయని అర్హత లేని వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారని ఆరోపించారు. లక్కీ డ్రాకు పది రోజుల ముందు అర్హుల జాబితా ఉండేదని ఆ తర్వాత అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించారనిమండిపడ్డారు. దీనిపై పూర్తిగా విచారణ జరిపించి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్బాస్, కనకం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్

**నిర్మల్ - భైంసా: ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భైంసా పట్టణంలోని సరస్వతి జూనియర్ కళాశాల సమీపంలోని నిర్మల్ రోడ్డుకు ఇరువైపులా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్త్రాత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు చెట్లు ఎంతో కీలకమని,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. పట్టణంలో పచ్చదనం పెంచేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మరిన్ని మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్



,స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తోషంలో గ్రంథాలయం ప్రారంభం

**ఇంద్రవెల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
యువత పుస్తక పఠనాన్ని దినచర్యగా మార్చుకుని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఐటీడీఏ పీఓ మంద మకరందుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువత కోసం రీడింగ్ రూమ్‌లను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పూలాజీబాబా 102వ జయంతి మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి, దరఖాస్తులు స్వీకరించాలని ఐటీడీఏ పీఓ మంద మకరందు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రమేష్, డీఎల్పీవో ఫణిందర్, తహసీల్దార్ కవితా రెడ్డి, ఎంపీడీవో ఇంతియాజ్, ఎంఈవో గోపాల్ సింగ్, సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ షేహనాజ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## స్నేహ సొసైటీలో ఘనంగా రాఖీ పండుగ

**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
సోదరభావం, ఆత్మీయతకు ప్రతీకగా స్నేహ సొసైటీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ దివ్యాంగ విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర సోదరీమణుల ఆత్మీయ బంధానికి ప్రతీక అన్నారు. దివ్యాంగులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. 17వ డివిజన్ కార్పొరేటర్ మమత శివ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రాఖీలు కట్టి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సిలుమల పోసాని జిల్లా అధ్యక్షురాలు వసంత భాగ్య దేవేందర్,ఇందిరా గిరిబాబు మోహన్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



**ఎల్లారెడ్డి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కళ్యాణి గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎల్. రాజులు, గ్రామ సర్పంచ్ చూడ నవ్య, ఉపసర్పంచ్ దేవ సాయిలు, ఏపీఎం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాలొన్నారు.

## నూతన హెల్త్ స్కీమ్‌లో కుటుంబ సభ్యుల అర్హతపై వివరణ



**ఎల్లారెడ్డి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమల్లోకి వచ్చిన నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (NEHS)లో వైద్య సేవలకు అర్హులైన కుటుంబ సభ్యుల వివరాలను ఉద్యోగులు ఈ నెల 31లోగా IFMIS పోర్టల్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంది పురుష ఉద్యోగి కుటుంబంలో ఆధారపడిన తల్లిదండ్రులు, భార్య, చట్టబద్ధమైన పిల్లలు అర్హులు. కుమారులకు 25 ఏళ్ల వరకు, కుమార్తెలకు వయోపరిమితి లేకుండా అర్హత ఉంటుంది. మహిళా ఉద్యోగి కుటుంబంలో ఆధారపడిన తల్లిదండ్రులు, భర్త, పిల్లలు అర్హులు. వివాహిత కుమార్తెలకు అర్హత ఉండదు. అయితే విడాకులు పొందిన, విడిపోయిన లేదా వితంతు కుమార్తెలు ఉద్యోగిపై పూర్తిగా ఆధారపడితే అర్హత ఉంటుంది. దత్తత ప్రక్రియ పూర్తయిన అనంతరం దత్తత తల్లిదండ్రులకే అర్హత వర్తిస్తుంది. సందేహాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

## హియరింగ్ నోటీసులపై ఆందోళన వద్దు

**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని వారికి, పేరు, వయస్సు తదితర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారికి హియరింగ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్, అర్బన్ నియోజకవర్గ ఈఆర్ఓ దిలీప్ కుమార్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశించిన సమయం, వేదికకు హాజరై అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. ముసా యిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబర్ 16 వరకు తెలియజేయవచ్చని, హియరింగ్ నోటీసుల పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. అర్హత ఉన్న ఓటర్ల పేర్లను పరిశీలించి జాబితాలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## సీపీ సాయి చైతన్యకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారీలు గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీపీకి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి, భద్రత, సోదరభావం పెంపొందించడంలో పోలీసుల సేవలను అభినందించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో రాఖీ పండుగను జరుపుకోవాలని సీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు వనజ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి, సమగ్ర రీ-సర్వేపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**నిర్మల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూభారతి, 22-ఏ, సమగ్ర భూ రీ-సర్వేపై రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూభారతి పోర్టల్‌లో 22-ఏకు సంబంధించిన భూముల విస్తీర్ణంలో తేడాలు ఉంటే వాటిని పోర్టల్‌లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22-ఏ కింద నమోదైన భూములను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సమగ్ర భూ రీ-సర్వే నిర్వహించి, ఫలితాల ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఆర్ఓలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, భైంసా సబ్ కలెక్టర్ అజ్మరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం




**నిజామాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల పురోగతిని సమీక్షించారు. కేసుల్లో పకడ్బందీగా దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో సకాలంలో చార్జిషీట్ దాఖలు చేయాలని, బాధితులకు అందాల్సిన పరిహారం, సహాయాన్ని ఆలస్యం లేకుండా అందించాలని ఆదేశించారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించి ఎస్సీ, ఎస్టీల హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. అసైన్డ్ భూముల కబ్జాలపై చర్యలు తీసుకుని బాధితులకు భూభారతి చట్టం ద్వారా న్యాయం చేయాలని సూచించారు. సాంఘిక బహిష్కరణ ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి రజిత, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



**నిర్మల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ పట్టణంలో నిరసన చేపట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, కౌన్సిలర్లు వోడిసెల అర్జున్, సూరజ్ నాయక్, బీజేవైఎం నాయకులు వెంకటేష్, హరీష్, జుట్టు దినేష్, భారత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా రాఖీ వేడుకలు




**పటాన్ చెరు, ఆగస్టు 27, (తెలంగాణ వాణీ):**
మండల పరిధి లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోదర--సోదరీమణుల అనుబంధం, ప్రేమ, ఆప్యాయతను ప్రతిబింబించేలా ఒకరికొకరు రాఖీలు కట్టుకుని పండుగను ఆనందంగా జరుపుకున్నారు.రాఖీ పండుగ సందర్భంగా పాఠశాల తరఫున విద్యార్థులు మండల విద్యాశాఖ అధికారి వి.వి. నాగేశ్వర్ నాయక్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పోలీస్ శాఖకు చెందిన ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, వినోద్‌లకు కూడా విద్యార్థులు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు అందరూ కలిసి మెలిసి సోదర--సోదరీ భావంతో ఉండాలని సూచించారు. రాఖీ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులంతా ఐకమత్యంతో ఉంటూ మంచి విలువలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు.

## ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి




**సిరిసిల్ల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, కన్వీనర్ సయ్యద్ జబీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
నూతన పీఆర్‌సీ ఏర్పాటు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, ఆరు పెండింగ్ డీఏల విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే సెప్టెంబర్ 10న ఛలో హైదరాబాద్ నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ మహాధర్నాలో జేఏసీ నాయకులు గాజుల సుదర్శన్, బొల్గం సాగర్, మెట్ట శ్రీకాంత్, మహమ్మద్ రియాజ్, జీ. శ్రీనివాస్ రావు, రాంనాథ్ రెడ్డి, మధుసూదన్ రావు, సదానందం, సుధాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, హరికిషన్, నయీమొద్దీన్ , లాల శ్రీనివాస్, మోతీలాల్, పురుషోత్తం, క్రిష్ణప్రసాద్, కొమ్ము రమేష్, సాయికిరణ్, విశ్వాన్, రామస్వామి, సురేష్, ప్రవీణ్, అనిల్, మహేందర్ రావు, బి. శ్రీనివాస్, శివసాయి, ఆర్. శేఖర్, లక్ష్మణ్ తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రక్షాబంధన్ వేడుకల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**సిరిసిల్ల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రక్షాబంధన్ సందర్భంగా సిరిసిల్ల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నేతాజీ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమంతో కూడిన రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం నివారించాలని కోరారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని




సూచించారు. రక్షాబంధన్ కానుకగా అన్నదమ్ములకు హెల్మెట్ అందించి రోడ్డు భద్రతపై ప్రోత్సహించాలని పోలీసులు పిలుపునిచ్చారు.



## అలుగునూరులో ఉత్సాహంగా గ్రామసభ

**తిమ్మాపూర్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ మండలం అలుగునూరులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ కల్వ మల్లేశం సమక్షంలో అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు చదివి వినిపించారు. కొత్తగా చేరిన, తొలగించిన పేర్లపై అధికారులు వివరాలు వెల్లడించారు. తండ్రి పేర్లలో అక్షర దోషాలు వంటి చిన్న పొరపాట్లకు భయపడాల్సిన అవసరం లేదని, ఆధార్ లేదా పాన్ కార్డు ఆధారంగా సవరణలు చేసుకోవచ్చని తహశీల్దార్ తెలిపారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు వివరాలను పరిశీలించుకున్నారు.

## మాదాపూర్‌లో పంటకుంట పనుల పరిశీలన



**కోరుట్ల రూరల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
జలసిరి కార్యక్రమంలో భాగంగా మాదాపూర్ గ్రామంలో చేపడుతున్న పంటకుంట పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ గురువారం పరిశీలించారు. సర్పంచ్ జంగ భూలక్ష్మి దేవేందర్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, రోజూ 40 మందికి పైగా కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీల హాజరు, పనుల నాణ్యత, పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అపర్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణతోనే బంగారు భవిష్యత్తు



**పెద్దపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
బాలికల రక్షణ, విద్య, సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం సుల్తానాబాద్‌లోని ఓల్డ్ ఏజ్ హోమ్, వికలాంగుల పాఠశాల, చిల్డ్రన్స్ హోమ్, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దయా అరుణ మాట్లాడుతూ బాలికలకు సమాన విద్యావకాశాలు కల్పించి, బాల్య వివాహాలు, హింస, వివక్ష, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బాలికలు ఉన్నత విద్య వరకు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నారులు, విద్యార్థినులు రాఖీలు కట్టుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ ఆశ్రిత, కేడర్ ఎన్జీవో ఆఫీసర్ సతీష్, ఓల్డ్ ఏజ్ హోమ్ కోఆర్డినేటర్ నరేడ్ల స్వామితో పాటు సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు

## రసూలాబాద్‌లో గ్రామసభ



**కొమురవెల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామంలో సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామిగౌడ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫారాల సవరణకు సంబంధించిన వివరాలను పరిశీలించడంతో పాటు డిజిటల్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏరోళ్ల సుదర్శన్, మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి బాలనర్సయ్య, జి.పి.ఓ నవీన్, వార్డు సభ్యులు అనే బోయిన మల్లేశం, శ్రీకాంత్, బౌద్దూర్, రేషన్ డీలర్ కృష్ణారెడ్డి, అంగన్వాడీ భారతి, గ్రామ ఆశ వర్కర్ సరూప, వివో అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, స్కూల్ పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు అబ్దుల్లా అలేని మహిపాల్ బాల్ నర్సయ్య బాబర్ శ్రీను యాదయ్య సంతోష్ మౌలానా గ్రామ యువకులు మహిళలు తదితరులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన కారు మహిళ మృతి



**హుస్నాబాద్ ఆగస్టు 27 (తెలంగాణ వాణి ఆర్ సి)**
భీమదేవరపల్లి వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్న కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలో పడటంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికితీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం రాం నగర్ (మంగళపల్లి) శివారులోచోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏలూరి రవీందర్‌రెడ్డి, ఏలూరి వీరారెడ్డి, ఏలూరి కిరణ్, ఏలూరి రాధా (61) గురువారం హుస్నాబాద్ మండలంపోతారం(ఎస్)లోని శుభం గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం కారులో తిరిగి వెళ్తుండగా రాం నగర్ (మంగళపల్లి) శివారు ప్రాంతంలో కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏలూరి రాధా(61) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురికితీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## గ్రామసభకు హాజరైన కలెక్టర్ సత్య ప్రసాద్.




**ఇబ్రహీంపట్నం ఆగస్టు 27 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఓటర్ జాబితా ప్రదర్శన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ జాబితాను అదికారులు చదివి వినిపించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఓటర్ జాబితాలో పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహారావు, తహసిల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో చిప్ప గణేష్, గ్రామ సర్పంచ్ బద్దం గోపి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జిల్లాల పవన్, అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు



## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**పెద్దపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యంతో పాటు చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సాగర్, దిలీప్ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో పేరు లేని వారికి నేటి నుంచి అవకాశం



**వేములవాడ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'సర్-2026' కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితాలో పేరు లేని వారు, మార్పులు లేదా చేర్పులు చేసుకునే అవకాశం సెప్టెంబర్ 17 వరకు ఉందని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. గురువారం పలు వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేనివారు ఫారం-6, మార్పులు, సవరణలకు ఫారం-8, అనర్హుల పేర్ల తొలగింపునకు ఫారం-7 ద్వారా బీఎల్‌ఓలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

## వీణవంక పోలీస్ స్టేషన్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**వీణవంక, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పరస్పరం రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక అన్నారు. మహిళలు, బాలికలకు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని, వారి భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా చూడాలి



**నారాయణఖేడ్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేర్లు లేని వారికి జారీ చేస్తున్న నోటీసులపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు అఫ్రీన్ మొహీత్ కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. నోటీసుల్లో పేర్కొన్న పత్రాల్లో నివాస ధ్రువీకరణ పత్రంపై ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను త్వరగా అందించేలా రెవెన్యూ అధికారులు సహకరించాలని, అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## రక్షాబంధన్ సందర్భంగా ఉచితంగా చీరల పంపిణీ

**రాజపేట, ఆగస్టు 27 (తెలంగాణ వాణి విలేఖరి)**
: రక్షాబంధన్ సందర్భంగా రాజపేట మండలంలోని పాఠశాలల స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు సుమారు రూ.55 వేల విలువైన చీరలను మండల విద్యాధికారి చందా రమేష్ గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పాఠశాలల పరిశుభ్రతకు కృషి చేస్తున్న కార్మికులకు కృతజ్ఞతగా చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇకముందు కూడా పాఠశాలల పరిశుభ్రత, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్, టి. రాజు బాలరాజు, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 97ను వెంటనే రద్దు చేయాలి



**హుస్నాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ఆర్‌సి):**
పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో డీఏఓ అధికారి అరిఫాకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 97 రద్దు కోసం పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు నష్టం కలిగించకుండా పాలిటెక్నిక్ విద్యను స్వతంత్రంగా కొనసాగించాలని, జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పీసరసత్యనారాయణరావు, అయిలేని గాల్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, నాంపల్లి శంకర్, గుగులోతు తిరుపతి నాయక్, ఇరుగు రమేష్, మాటూరి రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కస్తూర్బా హాస్టల్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి



**దేవరకొండ, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కొండమల్లేపల్లి కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. గురువారం కస్తూర్బా హాస్టల్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ లెక్చరర్ల వేధింపులు, పరుష పదజాలంతో దూషించడం, చదువులో వెనుకబడుతున్నామనే ఒత్తిడి కారణంగానే ఘటన జరిగినట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన యాజమాన్యంపై కూడా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి, భయరహిత విద్యా వాతావరణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర జాయింట్ సెక్రటరీ నూతనగంటి గణేష్, శివరామరాజు, కే , గోవింద్ , డెల బాల్ రాజ్కు ,హమ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా




**కరీంనగర్ టౌన్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు తదితరుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. వివిధ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెండో పీఆర్సీని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, ఆరు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందేలా హెల్త్ స్కీమ్‌ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జనరల్ మడిపల్లి కాళి చరణ్ గౌడ్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్ రెడ్డి, కేశవ రెడ్డి, ఉస్మాన్ పాష,ఈశ్వరయ్య, అశోక్ రావు, ఎండి సలీం, కరుణాకర్ రెడ్డి, సర్దార్ హర్విందర్ సింగ్, సరితా, కరుణ, విజయలక్ష్మి, పోలు కిషన్,రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, నరేష్, అజ్గర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రేడియం స్టిక్కరింగ్‌లో ‘దందా’ ఆరోపణలు?

### బార్‌కోడింగ్ లేని స్టిక్కర్లు.. లారీకి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు




**తిమ్మాపూర్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహనాలకు నిర్వహిస్తున్న రేడియం స్టిక్కరింగ్, బార్‌కోడింగ్ ప్రక్రియపై వాహనదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త వాహనాలకు కంపెనీల నుంచి వచ్చే రేడియం స్టిక్కర్లపై బార్‌కోడ్, గుర్తింపు నంబర్లు ఉంటుండగా, ఆర్టీఏ కార్యాలయం వద్ద వేస్తున్న కొన్ని స్టిక్కర్లపై అవి కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గతంలో రేడియం స్టిక్కరింగ్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఖర్చయ్యేదని, ప్రస్తుతం ఆన్‌లైన్ ప్రక్రియలు, ఇతర చార్జీల పేరుతో ఒక్కో లారీకి సుమారు రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెల్లించిన మొత్తానికి రసీదు కోరితే కొందరు ఏజెంట్లు బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**అధికారిక రుసుమెంత?**
రేడియం స్టిక్కర్లు సరఫరా చేస్తున్న ఏజెంట్లకు అధికారిక అనుమతులు ఉన్నాయా? ఒక్కో వాహనానికి వసూలు చేయాల్సిన రుసుము ఎంత? స్టిక్కర్లపై బార్‌కోడ్ లేదా ప్రత్యేక గుర్తింపు నంబర్ ఎందుకు ఉండటం లేదు? వసూలు చేసిన మొత్తానికి రసీదులు ఇస్తున్నారా? అనే అంశాలపై వాహనదారుల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత ఆర్టీఏ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని వాహనదారులు కోరుతున్నారు.

# రోబోటిక్స్ వివాదం...విచారణ పేరుతో ఎంఈఓ వసూళ్లు?




**కరీంనగర్ టౌన్ , ఆగస్టు 27, తెలంగాణ వాణి ప్రతినిధి**
కరీంనగర్ లోని జ్యోతినగర్‌లో గల సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రోబోటిక్స్ పుస్తకాల వివాదంపై విచారణ చేపట్టిన స్థానిక ఎంఈఓ భారీగా వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రోబోటిక్స్ పుస్తకాలు కొనలేదనే కారణంతో విద్యార్థులను శిక్షించారన్న ఘటనపై విచారణ జరిపాల్సిన అధికారి.. బాధ్యులకు అండగా నిలుస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాల యాజమాన్యం తీరుతో ఆందోళనలో ఉన్న తమకు, అధికారుల అవినీతి ఆరోపణలు మరింత వేదన కలిగిస్తున్నాయని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఎంఈఓ వసూళ్ల ఆరోపణలపై మరియు పాఠశాల యాజమాన్యం తీరుపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని... తప్పు తేలితే బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలి



**పెద్దపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. గురువారం అంతర్గాం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. సార్ ఫేజ్-2లో భాగంగా జరుగుతున్న ఓటరు వివరాల పరిశీలనకు ప్రజలు సహకరించాలని, వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని కోరారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.టి.ఎస్. అంతర్గాం సర్పంచ్ అంగోత్ రవి నాయక్, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# చిన్నమెట్‌పల్లి గ్రామసభలో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల రూరల్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి):**
చిన్నమెట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘సార్’ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలోని పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. తప్పులు ఉంటే సరిచేసుకోవడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ప్రతి అర్హుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని నర్సింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్, ఎమ్మార్వో కృష్ణ చైతన్య, గ్రామ సర్పంచ్ ఎండి రహీం , ఉప సర్పంచ్ మంజుల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పేరుమాండ్ల సత్యనారాయణ, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఆర్మూరి గంగాధర్, నాయకులు అనంత్ రెడ్డి, జై రెడ్డి, ఏలేటి రాజు, శేఖర్, తిరుపతి వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కర్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



**జగిత్యాల, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న రీ సర్వే పనులను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మండలం బర్థిపూర్ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్, ఎంజాయ్‌మెంట్ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ అనంతరం రైతుల వారీగా సర్వే చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ వరప్రసాద్, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# చల్లా వంశీచందర్ రెడ్డికి ఘన స్వాగతం



**తెల్లాపూర్ ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్ రెడ్డి తెల్లాపూర్‌లోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్, సీనిర్ కాంగ్రెస్ నాయకులు మల్లేశం గౌడ్, రవీందర్, కాంగ్రెస్ నాయకులు రవి గుళ్ళి, అరుణ్ గౌడ్, శ్రీనివాస్, రాజేష్ గౌడ్, అరుణ్ రెడ్డి, శ్రీను, చిన్నా, విక్రమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చల్లా వంశీచందర్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సందడితో కొనసాగింది.



## పేరిణి నృత్యంతో అలరించిన సంతోష్ శిష్య బృందం

**ఆలేరు, ఆగస్టు 27 (తెలంగాణ వాణి విలేకరి)**
: ఆలేరు మండల కేంద్రంలోని శ్రీ సంతోషిమాత గురుస్థానం 44వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో జనగామకు చెందిన శ్రీ చంద్రకళ నిలయం పెరమాండ్ల సంతోష్ మాస్టర్ శిష్య బృందం పేరిణి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. రాజపేటకు చెందిన సామల సురేష్--వాణి దంపతుల కుమార్తె సామల రేణుశ్రీ శ్రీ వెంకటేశ్వరస్వామి వేషధారణలో పేరిణి నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆమె ప్రతిభను పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రముఖులు అభినందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవిని రేణు శ్రీ తల్లిదండ్రులు సామల సురేష్- వాణి శ్రీమన్నారాయణ యెంగల్ దాస్ వెంకటేశం స్రవంతి ఉదయ్ కుమార్ యాదగిరి రమ్య. శ్రీనిధి ,తదితరులు పాల్గొన్నారు

## ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకునే అవకాశం




**పెద్దపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: రామగుండం 29వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఓటరు జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించి అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పేర్లు, వివరాల మార్పులు, సవరణలకు సంబంధించి కొందరికి నోటీసులు వచ్చినట్లు కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు, వివరాలను పరిశీలించుకుని తప్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు.

## దూడల సంపత్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం.

**హుస్నాబాద్ ఆగస్టు 27 (తెలంగాణ వాణి ఆర్ సి)**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవర పల్లి మండలం కొత్తకొండ మాజీ సర్పంచ్ దూడల సంపత్ గౌడ్ ఆకస్మికంగా మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సంపత్ గౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి, నియోజక వర్గానికి తీరని లోటని మంత్రిపేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.దూడల సంపత్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విషాద సమయంలో సంపత్ గౌడ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.సంపత్ గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించేందుకు పార్టీ శ్రేణులు అండగా నిలవాలని మంత్రి సూచించారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**రాయికోడ్, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం హులిగరా గ్రామంలో గురువారం లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో షరీఫ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉమారాణి కి ఉత్తమ అవార్డ్

**పటాన్ చెరు, ఆగస్టు 27, (తెలంగాణ వాణి)**



పటాన్ చెరు మండల వనరుల కేంద్రం లో డాటా ఎంట్రీ ఆపరేటర్ గా పని చేస్తున్న ఉమారాణి కి జిల్లా తపస్ ఉపాధ్యాయ సంఘం ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. బుధవారం సంగారెడ్డి లో జరిగిన గురువందనం కార్య క్రమంలో ఆమెకు ఈ అవార్డ్ అంద జేశారు. స్థానిక మండల వనరుల కేంద్రం లో ఆమె గత 15 ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్ గా సేవలు అందిస్తూ పలువురి మన్ననలు పొందారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఆమెకు అవార్డ్ అంద జేశారు. ఆమెకు అవార్డ్ రావడం పట్ల కుంభ మేళా టీమ్ సభ్యులు దండు జ్యోతి, కే. వి. రవీందర్, లక్ష్మీ ప్రసన్న, బావ, శేషాద్రి తదితరులు శుభాకాంక్షలు తెలియ జేశారు.

## మహిళా ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**చౌటుప్పల్ , ఆగస్టు 27 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**

చౌటుప్పల్ మున్సిపల్ పరిధి బంగారు గడ్డ ఏరియా మహిళా సంఘాల ఫెడరేషన్ సర్వ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పందిరి పారిజాత, ఉపాధ్యక్షురాలుగా రఫీ ఆ సుల్తానా, కార్యదర్శిగా బి. గాయత్రి, సహాయ కార్యదర్శిగా ఏ. ప్రసన్న, కోశాధికారిగా బి విజయలక్ష్మి ఎన్నికయ్యారు. రిసోర్స్ పర్సన్ ( ఆర్ పి )గా ఉడుగు రాజేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి మెప్మా జిల్లా మేనేజర్ రమేష్, సూపరింటెంట్ సత్యనారాయణ, పురపాలిక మెప్మా ఇన్చార్జి అంజయ్య హాజరై నూతనంగా ఎన్నికైన ఆర్పి రాజేశ్వరికి ఎన్నిక పత్రాన్ని అందజేశారు.

## డెంగ్యూ నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**వనపర్తి, ఆగస్టు 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



వనపర్తి జిల్లాలో డెంగ్యూ, సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేసింది. డెంగ్యూ బారిన పడి వివాహిత మహిళతో పాటు 8 ఏళ్ల బాలిక మృతి చెందడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. పారిశుద్ధ్యం, దోమల నివారణ చర్యలపై అధికారుల పర్యవేక్షణ మరింత పెంచాలని కోరింది. ప్రజా ఆరోగ్యంపై ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, వ్యాధుల నియంత్రణకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అఖిలపక్ష ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



జిల్లాకు చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి పనిని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కాని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. గురువారం నూతన కలెక్టరేట్ సముదాయ సమావేశపు హాల్లో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవురావు అధ్యక్షతన జిల్లా స్థాయి ఇంజనీరింగ్ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులను పూర్తి చేసే విషయంలో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల వైఫల్యం స్పష్టంగా కనపడుతుందని అన్నారు. తాను ఇటీవల రెండు కార్యాలయాలను సందర్శించిన సమయంలో ఉద్యోగులు విధులకు గైరాహాజరైన విషయం గ్రహించానని ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గోదావరి జిల్లాలను ములుగు ప్రాంతానికి తరలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి 2 వందల కోట్ల రూపాయలను మంజూరు చేశారని, ఆ నిధులతో రామప్ప, లక్నవరం, పొట్లాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించడం జరుగుతుందని అన్నారు. రామప్పలో పూర్తిస్థాయిలో నీటిని నింపడం వలన రైతులు భూములు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని, అధికారులు భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సేకరించి వారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ ఁ బి, పంచాయతీరాజ్, ఐటీడీఏ ఇంజనీరింగ్ సెక్షన్ల అధికారులు ప్రతి పనిపై దృష్టి సారించాలని రోడ్లు, భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, ఆర్టీవో డైరెక్టర్ వసంత రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు నాశనం: ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం




తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97 (+ూ 97) పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీసేలా ఉందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ (జ్వశ్రీఙ ఞయవఅవవతీ) ఆరోపించారు. ఇవాళ నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడేళ్ల పాలిటెక్నిక్ సాంకేతిక కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు నేరుగా ఇంజినీరింగ్ సెకండియర్‌లో ప్రవేశం పొందే అవకాశం ఉంటుందని, అయితే ఈ కొత్త జీవో వల్ల వారి ఉన్నత విద్యా అవకాశాలు ప్రమాదంలో పడ్డాయని ఆయన పేర్కొన్నారు.

**˜నలపై ఫైర్..**

జీవో 97ను తక్షణమే రద్దు చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నారని ఈటల రాజేందర్ తెలిపారు. విద్యార్థుల ఆందోళనను అర్థం చేసుకుని సమస్యను పరిష్కరించాల్సింది పోయి, విద్యాసంస్థల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి అరెస్టులు చేయించడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రభుత్వం క్యాంపస్‌లలో భయాందోళన వాతావరణాన్ని సృష్టిస్తోందని తీవ్రంగా విమర్శించారు. అన్యాయమైన జీవోకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు బీజేపీ (దీజీూ) సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటానికి జీవో 97ను రద్దు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# కోమా నుంచి ప్రపంచ ఛాంపియన్‌గా..

## -తైక్వాండో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న ఎల్లావుల గౌతమ్ యాదవ్

అడ్డంకులను అధిగమించి ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగిన గౌతమ్ యాదవ్, ఇప్పుడు కొత్త తరానికి ఛాంపియన్లను తయారుచేస్తూ స్ఫూర్తిదాయక క్రీడా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వరంగల్‌కు చెందిన ఈ అంతర్జాతీయ పారా తైక్వాండో క్రీడాకారుడు,కోచ్, మెంటార్ ఎల్లావుల గౌతమ్ యాదవ్ ప్రత్యేక కథనం.

సాధారణ తైక్వాండో క్రీడాకారుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం,జాతీయ స్థాయి క్రీడాకారుడిగా, విశ్వవిద్యాలయ కోచ్‌గా, తీవ్రమైన రోడ్డు ప్రమాదాన్ని ఎదుర్కొన్న వ్యక్తిగా,చివరకు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేతగా సాగింది.తాను ఛాంపియన్‌గా మారిన తర్వాత, మరొక ఛాంపియన్‌ను తయారు చేయాలనే లక్ష్యంతో కోచ్‌గా మారడం ఆయన ప్రయాణంలోని మరో గొప్ప అధ్యాయం.

12 ఏళ్ల వయస్సులో మొదలైన ప్రయాణం

చిన్న వయస్సులోనే తైక్వాండోపై ఆసక్తి పెంచుకున్న గౌతమ్ యాదవ్,ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (సాయి) కర్నూలు కేంద్రంలో కఠినమైన శిక్షణ పొందారు. 2006 నుంచి రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభను చాటుకున్నారు.స్కూల్ గేమ్స్ నేషనల్స్, సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్స్, సీనియర్ నేషనల్స్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొన్నారు. తైక్వాండోతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ (బి. టెక్) పూర్తి చేశారు.

**క్రీడాకారుడి నుంచి కోచ్‌గా..**

తన క్రీడా అనుభవాన్ని తర్వాతి తరానికి అందించాలనే ఉద్దేశంతో కోచింగ్ రంగంలోకి ప్రవేశించారు.

సాయి - నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్. ఐ. ఎస్) కేరళ నుండి తైక్వాండో కోచింగ్ సర్టిఫికేషన్ సాధించారు.

కుక్కివాన్ ఇన్‌స్ట్రక్టర్ కోర్స్

వరల్డ్ తైక్వాండో ఆసియా కోచ్ లైసెన్స్'అర్హతలు సాధించారు.

జే.ఎన్. టి.యు హైదరాబాద్, కాకతీయ యూనివర్సిటీలలో కోచ్‌గా పనిచేసి ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ పోటీలకు



Taking Virtual Para Taekwondo Training to the Par athlete's across the Telangana State



క్రీడాకారులను సిద్ధం చేశారు.

2020 ప్రమాదం: జీవితాన్ని మార్చిన మలుపు.!

2020లో ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్ నుంచి తిరిగి వచ్చిన కొద్దికాలానికే తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.చికిత్స, పునరావాసం (రిహాబిలిటేషన్), ఫిజియోథెరపీపై దృష్టి పెట్టాల్సి వచ్చింది.అయినా ఆ పరిస్థితిని జీవితానికి ముగింపుగా భావించకుండా, పారా తైక్వాండోలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. నిరంతర సాధన,పట్టుదలతో తిరిగి క్రీడారంగంలోకి అడుగుపెట్టారు.

"కోమా" నుంచి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం వరకు

పారా తైక్వాండోలోకి పునరాగమనం చేసిన గౌతమ్ యాదవ్ అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించారు.

**ప్రధాన విజయాలు:**

2024: వరల్డ్ పారా తైక్వాండో పూమ్సే ఛాంపియన్‌షిప్ (బహ్రెయిన్) -- స్వర్ణ పతకం

2024: కే.టి.ఏ ఆన్‌లైన్ ఇంటర్నేషనల్ పారా తైక్వాండో ఛాంపియన్‌షిప్ (ఇంగ్లాండ్) -- స్వర్ణ పతకం

2025: 10వ ఆసియన్ పారా టైక్వాండో ఛాంపియన్‌షిప్ (మలేషియా) -- రజత పతకం

2026: 5వ ఇండియా తైక్వాండో ఓపెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ (పుణే) -- స్వర్ణ పతకం

2026: 3వ తెలంగాణ స్టేట్ పారా తైక్వాండో ఛాంపియన్‌షిప్ (వరంగల్) -- స్వర్ణ పతకం

సీనియర్ నేషనల్ పారా టైక్వాండో ఛాంపియన్‌షిప్స్‌లో 4 స్వర్ణ పతకాలు, తెలంగాణ స్టేట్ ఛాంపియన్‌షిప్స్‌లో 3 స్వర్ణ పతకాలు, బెంగళూరులో జరిగిన 4వ నేషనల్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించారు.

**ఛాంపియన్లను తయారుచేస్తూ...**

ప్రస్తుతం వారు"ఎస్.ఎం.ఏ" తైక్వండో" ద్వారా పారా తైక్వాండో క్రీడాకారులకు శిక్షణ, మెంటార్‌షిప్ అందిస్తున్నారు.ఆయన




మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన క్రీడాకారులు ఇప్పటివరకు 2 అంతర్జాతీయ పతకాలు,17 జాతీయ స్థాయి పతకాలు సాధించారు.

**ప్రభుత్వానికి విజ్ఞప్తులు:**

ఉచిత రిహాబిలిటేషన్ సెంటర్లు: స్పైనల్ కార్డ్ గాయాలైన(స్పైనల్ కార్డ్ ఇంజురీ) పేద బాధితుల కోసం ప్రతి జిల్లాలో ఉచిత ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ మరియు స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని

క్రీడాకారులకు ఆర్థిక సాయం: వీసా, విమాన టికెట్లు,వసతి, క్రీడా పరికరాల ఖర్చులు భారంగా మారకుండా అంతర్జాతీయ పారా క్రీడాకారులకు ప్రభుత్వం ముందస్తు ఆర్థిక సాయం అందించాలని.

?ఉద్యోగ భద్రత (జీ.ఓ. నం. 73): పారా స్పోర్ట్స్‌ను జీ. ఓ. నం. 73లో చేర్చి, అంతర్జాతీయ పారా పతక విజేతలకు స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**సమగ్ర పారా స్పోర్ట్స్ విధానం:**

పునరావాసం,శిక్షణ, పరికరాలు, ఉద్యోగ భద్రతలను కలిపి ఒక సమగ్ర పారా స్పోర్ట్స్ విధానాన్ని రూపొందించాలంటున్నారు.

"పరిస్థితులు మనల్ని ఆపవచ్చు. కానీ మన సంకల్పాన్ని ఆపలేవు. కోమా నుంచి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం వరకు తన ప్రయాణం నన్ను ఛాంపియన్‌గా చేసింది.కానీ పార తైక్వండో లో అనేక మంది క్రీడాకారుల్ని ఛాంపియన్ లు గా తీర్చిదిద్దిన రోజే నా ప్రయాణానికి నిజమైన అర్థం వస్తుందని,తుది శ్వాస వరకు తైక్వాండో క్రీడా కోసం పరితపిస్తానని,ప్రపంచ స్థాయిలో భారత దేశ క్రీడాకారులు విజయ భావుట ఎగరవేసేవరకు విశ్రమించేది లేదన్నారు.

అంతేకాకుండా తను ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో వారి సోదరుడు గణేష్ యాదవ్ వారికి వెన్నుదన్నుగా నిలబడ్డారని తెలంగాణ వాణి వరంగల్ ప్రత్యేక ప్రతినిదితో చెప్పుకొచ్చారు.

--- ఎల్లావుల గౌతమ్ యాదవ్ (అంతర్జాతీయ పారా తైక్వాండో క్రీడాకారుడు, కోచ్, మెంటార్)







## విజయవాడ హైవేపై 17 ఫ్లైఓవర్లు త్వరగా పూర్తి చేయాలి: మంత్రి కోమటిరెడ్డి

నిత్యం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన హైదరాబాద్-విజయవాడ హైవేను 8 లేన్లుగా విస్తరించడమే పరిష్కారమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇదే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, తాను కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీని పలుమార్లు కలిసినట్లు గుర్తుచేశారు. ఈ హైవేపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఇప్పటికే వేల మంది తమ ప్రాణాలను కోల్పోయారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. సెక్రటేరియట్‌లో గురువారం రోడ్లు భవనాల శాఖ పరిధిలోని పలు రోడ్లు, ఎన్.హెచ్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు. హైదరాబాద్- విజయవాడ రహదారిలో గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్ పై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లు,హై మాస్క్ లైట్స్ పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. దాదాపు అన్ని ఫ్లై ఓవర్లు నిర్మాణ చివరి దశలో



ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పెద్దకాపర్తి ఫ్లై ఓవర్ ఇప్పటికే ట్రాఫిక్ అనుమతిస్తుండగా, సూర్యాపేట ఫ్లై ఓవర్ ట్రాఫిక్ అనుమతికి సిద్ధంగా ఉందన్నారు. చిట్యాల ఫ్లై ఓవర్ ఈ దసరా నాటికి పూర్తి చేయాలని, మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని మంత్రి ఆదేశించారు. ఆ ఫ్లై ఓవర్ల నుండి ఈ సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలని అధికారులకు తేల్చి చెప్పారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై, కొన్ని చోట్ల రహదారికి రెయిలింగ్ లేని వార్తలపై ఆరా తీసిన మంత్రి... ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులకు పలు సూచనలు చేశారు. మూగ జీవులు రహదారిపైకి రాకుండా రెయిలింగ్ తో పాటు, రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలు నివారించాలంటే ఈ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తామని... అవసరమైతే ప్రధాన మంత్రిని కూడా కలుస్తామన్నారు. ఎన్.హెచ్-65 విస్తరణ పనులతో పాటు, బుల్లెట్ ట్రైన్స్, ఇతర ఎన్.హెచ్.ఎ.ఐ ప్రాజెక్ట్స్ త్వరగా చేపట్టాలని కోరతామని మంత్రి పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి.. కానిస్టేబుల్ శంకర్‌కు భారీ పరిహారం

విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ శాఖ, బ్యాంక్ ఆఫ్ బరోడా సంయుక్తంగా కొండంత అండగా నిలిచాయి. పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద మంజూరైన రూ. 95 లక్షల భారీ బీమా పరిహారాన్ని గురువారం రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో కంబాల శంకర్ (31) ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. గత మార్చి 28న విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాడపర్తి గ్రామం వద్ద అదుపుతప్పి తీవ్ర ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన శంకర్‌ను మెరుగైన వైద్యం కోసం తొలుతఎయిమ్స్ ఆసుపత్రికి, ఆ తర్వాత అక్కడినుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మార్చి 31న శంకర్ మృతి చెందాడు. యువకుడైన కొడుకు చనిపోవడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది. కానిస్టేబుల్ శంకర్ తన వేతనాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతా ద్వారా తీసుకునేవాడు. శంకర్ ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయాన్ని అధికారులు బ్యాంకు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే బీమా క్లెయిమ్ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా జీటీఎల్ కింద రూ. 15 లక్షలు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ కింద రూ. 80 లక్షలు కలుపుకుని.. మొత్తంగా రూ. 95 లక్షల భారీ పరిహారం




మంజూరైంది. మంజూరైన ఈ రూ. 95 లక్షల చెక్కును గురువారం డీజీపీ సి.వి. ఆనంద్ తన కార్యాలయంలో శంకర్ తల్లిదండ్రులకు అందజేసి, ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు.

